పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# రాష్ట్రపతి అల్పాహారం విందుకు హాజరైన ఏలూరు ఎంపీ మహేష్ కుమార్





ఏలూరు టౌన్ , **మార్చి 17,ప్రభాత వార్త** : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్ లో సోమవారం ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు సహచర పార్లమెంట్ సభ్యులు, రాజ్యసభ సభ్యులతో కలిసి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన పరిచయ కార్యక్రమంలో ఎంపీ మహేష్ కుమార్ చేతులు జోడించి రాష్ట్రపతి ముర్ముకు నమస్కరించారు. అనంతరం రాష్ట్రపతి ముర్ము ఇచ్చిన అల్పాహారం విందులో ఎంపీ మహేష్ కుమార్ పాల్గొన్నారు. చివరిగా రాష్ట్రపతి ముర్ముతో సహచర ఎంపీలతో కలిసి మహేష్ కుమార్ గ్రూప్ ఫోటో దిగారు.

# సుస్థిరాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకం

## - జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**ఏలూరు, మార్చి , 17 : ప్రభాతవార్త :**
దేశ సుస్థిర అభివృద్ధిలో సహకార సంస్థల పాత్ర కీలకమని, సహకార సంఘాల వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో సోమవారం జరిగిన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరం ప్రకటించిందన్నారు. సహకార సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సహకార వ్యవస్థ స్థిరమైన జీవనోపాధి సృష్టించుటకు వారి ఆర్థిక అభివృద్ధికి కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి, సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు సహకార వ్యవస్థను గురించి ప్రజలలో అవగాహన కలిగించేందుకు ర్యాలీలు, సమావేశాలు, మారథాన్ లు నిర్వహించాలన్నారు. జిల్లాలో 2025 సంవత్సరంలో నెలవారీగా చేయవలసిన పనులపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందని, ప్రణాళిక ననుసరించి కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సహకార శాఖాధికారులను ఆదేశించారు. సహకార వ్యవస్థ ద్వారా సమాజాభివృద్ధిపై పాఠశాల స్థాయి నుండి అవగాహన కలిగించేందుకు మార్చి నెలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సర్వసభ్య సమావేశాలలో ద్వారా వ్యవసాయ రంగం, ఇతర రంగాలకు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సహకారరంగాన్ని ఉన్నతమైన వ్యవస్థగా రూపొందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకార రంగంలో తీసుకున్న సంస్కరణల గురించి చేస్తున్న కార్యక్రమాలను వివరించాలన్నారు. ఏప్రిల్ నెలలో రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని, సహకార రంగ అభివృద్ధిలో మహిళా పొదుపు సంఘాల పాత్ర గురించి తెలియజేయాలన్నారు. మే నెలలో సహకార రంగాలలో సుపరిపాలనకు తీసుకోవలసిన చర్యలు గురించి సహకార సంఘాల సభ్యులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జూన్ నెలలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. జులై నెలలో జులై,5వ తేదీ



అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా ర్యాలీలు, మారథాన్ లు నిర్వహించాలన్నారు. ఆగష్టు లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ లో పాఠశాలలు, కళాశాలల్లో సహకార వ్యవస్థ, దేశ అభివృద్ధిలో పాత్ర అనే అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సాగు రైతులు, ఉద్యానవన రైతులు , మత్స్యకారులకు వారి పంట సీజన్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత

## - ఎస్పీ శ్రీ అద్నాన్ నయీం అస్మి



**భీమవరం మార్చి 17 ప్రభాతవార్త :**
ప్రజా ఫిర్యాదులు పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ మరల మరల అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి , ఐపీఎస్., పోలీస్ అధికారులను ఆదేశించారు. మార్చ్ 17 న సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను ఎస్పీ గారు స్వయంగా స్వీకరించి వారి సమస్యలను విని, సానుకూలంగా స్పందించి, వారి సమస్యలపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు.సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ ఉండాలన్నారు. అర్జీలు మరల మరల పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈరోజు నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త,అత్తారింటి వేధింపులు,భూ–ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం,ప్రేమ పేరుతో మోసం, ఆస్థి తగాదాలు,ఇతర పలు సమస్యలపై మొత్తం 11 అర్జీలను ఎస్పీ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు ,జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వి. పుల్లారావు , జిల్లా మహిళా పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ అహ్మద్ ఉన్నీషా ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈనెల 24 నుండి వనువులమ్మ - కనకదుర్గమ్మ అమ్మవార్ల 6వ వార్షికోత్సవం

**పెనుమంట్ర, మార్చి–17, ప్రభాతవార్త:**
మండలంలోని నెగ్గిపూడిలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ వనువులమ్మ – కనకదుర్గమ్మ అమ్మవార్ల 6వ వార్షికోత్సవం ఈనెల 24వ తేదీన జరుగు 06వ వార్షికోత్సవ సందర్భంగా అమ్మవార్లకి తెల్లవారుజామున 5.00 లకు పంచామృత – ఫల రసాలు – సుగంధ ద్రవ్యాల తో అమ్మవార్లకు అభిషేక కుంకుమార్చనలు జరుగునని ఆలయ అర్చకులు జె ఆశీష్ శర్మ, ఆలయ ఆసాదు లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి సేవకు గోత్రనామాలతో ఎవరైనా ఈ అభిషేక కుంకుమార్చనలో పాల్గొనదలచిన ఆలయ అర్చకులను కానీ కమిటీ సభ్యులను కానీ సంప్రదించవలసినదిగా కోరారు. అనంతరం ఆలయంలో ఉదయం 7.00 ల నుండి పాలసత్తి రామిరెడ్డి (రాజా) జయ నాగ ఉమా చంద్రిక దంపతులచే " ప్రత్యంగిరా సహిత చండీ హెూమం జరుగునని తెలిపారు. మధ్యాహ్నం 12.30 ని'ల నుండి ఆలయం వద్ద అమ్మవారి అన్నప్రసాదం ఏర్పాటు





చేయబడునని కావున భక్తులు అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు. అలాగే సాయంత్రం 5.00 గం.లకు " లలితా సహస్ర నామ పారాయణ అనంతరం అమ్మవార్లకు ఏక హారతి, పంచ హారతి , నక్షత్ర హారతి " ఇవ్వడం జరుగునని తెలిపారు. కావున భక్తులు అందరూ ఆలయానికి విచ్చేసి – అమ్మవార్లను దర్శించి – అమ్మవార్లకు నమస్కరించి – అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు తీసుకుని – అమ్మవార్ల కృపకు పాత్రులు కావలసిందిగా కోరుతున్నాము.

# ఏజెన్సీ సమస్యలపై గలమెత్తిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి



**వేలేరుపాడు, మార్చి 17,ప్రభాత వార్త:**
ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సదుపాయల గురించి ఏజెన్సీ గిరిజనులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల గురించి పోలవరం ఎమ్మెల్యే చిర్రి.బాలరాజు ఈరోజు అసెంబ్లీలో గలమెత్తారు. ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సహాయం అందక చాలామంది గిరిజనులు చనిపోయే వాళ్లని అలాంటి సమస్యలు మరల పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఇప్పుడు ఉన్నటువంటి ప్రతీ హాస్పిటల్లో ఇంకా బెడ్ల సంఖ్య పెంచాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో తప్పకుండా వైద్య సహాయం ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి 24 గంటలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మారుమూల గ్రామాలకు వెళ్లాలంటేనే రోడ్లు సదుపాయం లేక చాలా ఇబ్బందులు పడేవాళ్లని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే చొరవతో సీసీ రోడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఏజెన్సీ ప్రాంతాల్లోని సమస్యల పైన కూడా ఎమ్మెల్యే గారి స్పందన బాగుంది అని, ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నటువంటి పోలవరం పరిహారం విషయంలో ఎమ్మెల్యే తీసుకున్న శ్రద్ధ మరువలేనదని ప్రజలనుకుంటున్నారు. గెలుపొందినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి సమస్య వచ్చినప్పుడల్లా అందుబాటులో ఉంటూ పోలవరం నియోజకవర్గంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా వాళ్ళ సమస్యను ఓపిగ్గా వింటూ పరిష్కరిస్తున్నటువంటి ఎమ్మెల్యే చిర్రి. బాలరాజు ఈరోజు అసెంబ్లీలో ఏజెన్సీ సమస్యలపై వివరిస్తూ అసెంబ్లీ సమావేశాల్లో ఆయనకు ఇచ్చినటువంటి సమయాన్ని వినియోగించుకుంటూ ఏజెన్సీ ప్రాంతాల సమస్యలపై గళమెత్తుతున్నందుకు ప్రజలందరూ కూడా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుని అభినందిస్తున్నారు.

# శ్రీ కోదండ రామాలయం పున: ప్రతిష్ట మహోత్సవములు

**జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త:**
పట్టణంలోని రామచంద్రపురం లోని శ్రీ కోదండ రామాలయం పున ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం నుండి పలు పూజ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కోదండ రామాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ రామచంద్ర స్వామి వారి విగ్రహాలను వేలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ పరిమి ధర్మరాజు,పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్ ,అధ్యక్షులు మోతుకూరి నారాయణరావు, కార్యదర్శి కోరా రఘురాం ఆధ్వర్యంలో భక్తులకు కావలసిన ఏర్పాట్లన్నీ చేయించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, పట్టణ టిడిపి అధ్యక్షులు రావూరి కృష్ణ,కౌన్సిలర్ పి పి ఎస్ చంద్రరావు,మహంకాళి రాంబాబు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు. భక్తులకు భారీ అన్న సమారాధన



జరిగింది. పండిత సత్కారం ను నిర్వహించారు. పలువురు దాతలు నూతన రామాలయం అభివృద్ధికి విరాళాలు అందజేశారు. దేశ, విదేశాలలోని భక్తులు విరాళాలు అందించడం విశేషం. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తపన ఫౌండేషన్ అధినేత బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి పాల్గొన్నారు. తపన చౌదరిని కమిటీ వారు ఘనంగా సన్మానించారు.

# మధ్యవర్తిత్వంపై శిక్షణా తరగతులు - 40 మంది న్యాయవాదులకు ఐదు రోజులు శిక్షణ

**ప్రభాతవార్త ఏలూరు :**
రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఎంపిక చేసిన న్యాయవాదులకు (40 గంటలు) ఐదు రోజులపాటు మధ్యవర్తిత్వము పైన శిక్షణా తరగతులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు బార్ అసోసియేషన్ భవనం నందు నిర్వహిస్తున్నామని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి (ఎఫ్.ఎ.సి)/ మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం సునీల్ కుమార్ తెలియజేశారు. జనవరి నెలలో నిర్వహించిన శిక్షణ తరగతులకు అనుబంధంగా మరింతమంది





న్యాయవాదులకు మధ్యవర్తిత్వం పైన శిక్షణ ఇవ్వడం ద్వారా కక్షిదారులకు సేవలను మరింత త్వరితగతిన అందించే ఉద్దేశంతో ఈ రెండవ విడత కార్యక్రమాన్ని చేపడుతున్నామని కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఒకటి చక్కటి మార్గమని తెలియజేశారు. ఈ శిక్షణ తరగతుల ద్వారా న్యాయవాదులు నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచుకొని కక్షిదారులకు సేవ చేయాలని అలాగే కేసుల త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు మరియు కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి పి.మంగాకుమారి, ఐదవ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి జి రాజేశ్వరి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం సుప్రీంకోర్టు ద్వారా శిక్షణ పొంది, నియమితులైన మధ్యవర్తిత్వ శిక్షకులు సుదర్శన్ సుందర్ మరియు వి.పి. తంకచన్ పాల్గొన్నారు.

**ఆర్.ఓ.సి.నెం. : 9/2025** **టెండరు ప్రకటన** **తేది: 15-03-2025**

పెనుగొండ మండలం, పెనుగొండ గ్రామ పంచాయితీకి చెందిన ఈదిగువ షెడ్యూలులో తెల్పిన పనులు 2025-26 సం.రంలో కాంట్రాక్ట్ పద్ధతిపై నిర్వహించుటకు మరియు 2025-2026 సం.రంలో కావలసిన సామాగ్రి సరఫరా చేయుటకు సీలువేసిన టెండర్లు ది.22-03-2025 తేదీ శనివారం మధ్యాహ్నం 2.00 గంటల వరకు గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద పంచాయితీ కార్యదర్శివారిచే గాని లేక వారిచే అధికారము పొందిన మరొకరిచే గానీ స్వీకరించబడి, ఆదే రోజు మధ్యాహ్నం 4.00 గంటలకు హాజరైన టెండరుదార్ల సమక్షమున టెండర్లు తెరువబడును. షెడ్యూలులో టెండరు ధరావత్తును చెల్లించి టెండర్లు దాఖలు చేయవలెను. టెండరు షరతులు, ఇతర విషయములకొరకు ఆఫీసు పనిచేయుకాలములో తెలుసుకొనవలయును.

టెండరు షెడ్యూలు

| వ.నెం. | వివరములు | వ్యక్తుల సంఖ్య | చెల్లించవలసిన దరావత్తు |
|---|---|---|---|
| 1. | పారిశుధ్య పనులు నిర్వహణ (స్వీపర్లు,డ్రైను క్లీనర్స్) | 62 | ఒక్కొక్కరికి రూ.50/-లు |
| 2. | వాటర్ వర్క్స్ పనులు నిర్వహణ (ప్లంబింగ్, ఫిట్టర్స్) | 6 | ఒక్కొక్కరికి రూ.50/-లు |
| 3. | వీధి విద్యుత్ లైట్లు నిర్వహణ (ఎలక్ట్రీషియన్) | 3 | ఒక్కొక్కరికి రూ.50/-లు |
| 4. | విద్యుత్ లైట్ల విడిభాగములు సప్లయి చేయుట | | రూ. 500/- లు |
| 5. | ప్రజారోగ్య పారిశుధ్య సామాన్లు సప్లయి చేయుట | | రూ. 500/- లు |
| 6. | వాటర్ వర్క్స్ విడి సామాన్లు సప్లయి చేయుట | | రూ. 500/- లు |
| 7. | చేతిపంపు సామాన్లు సప్లయి చేయుట | | రూ. 500/-లు |
| 8. | స్టేషనరీ సామాన్లు సప్లయి చేయుట | | రూ.100/-లు |

గమనిక : పైన తెల్పిన పనులు 2025-26 సం॥రకాలం అనగా ది.1-4-2025 నుండి 31-3-2026 వరకు

సం/- : **శ్రీమతి నక్కా శ్యామలా సోనీ**
సర్పంచ్ : గ్రామ పంచాయితీ - **పెనుగొండ**
పెనుగొండ మండలం

సం/- : **టి. రత్నాకరరావు**
కార్యదర్శి : గ్రామ పంచాయితీ - **పెనుగొండ**
పెనుగొండ మండలం

# కైకలూరు సమస్యలపై ఉద్యమ కార్యచరణ చేపడతాం

## - కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర చైర్మన్ శొంఠి నాగరాజు

**కైకలూరు మార్చి 17 (ప్రభాతవార్త) :**
కైకలూరు నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై ఉద్యమ కార్యచరణ కాంగ్రెస్ పార్టీ చేపడుతుందని రాష్ట్ర ఓబీసీ చైర్మన్ శొంఠి నాగరాజు తెలిపారు. సోమవారం కైకలూరు పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ నందు కాంగ్రెస్ పార్టీ కైకలూరు నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు నోబుల్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శొంఠి నాగరాజు మాట్లాడుతూ బీసీ వర్గాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర పర్యటనలో భాగంగా తాను కైకలూరు విచ్చేసినట్లు తెలిపారు. కొల్లేరు సమస్యపై షర్మిలమ్మ ఆదేశాల మేరకు ఉద్యమం చేపడుతామన్నారు. ఏలూరు జిల్లా ఓబీసీ చైర్మన్ గా కట్టా నాగరాజు గౌడ్ త్వరలో నియామకపత్రం అందుకోనున్నట్లు చెప్పారు. వైద్యరత్నం, పేదల పాలిట పెన్నిధి కాళ్లపాలెం డాక్టర్ విగ్రహాన్ని 4 మండలాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమాలపై, ప్రజా సమస్యల పై పోరాటం చేయడానికి ఉద్యమ కార్యాచరణ చేపట్టామన్నారు. బొడ్డు నోబుల్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు 2019 నుండి 2024 వరకు లేఅవుట్, మట్టి మాఫియా, బియ్యం వంటి అక్రమాలపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కైకలూరు మండల అధ్యక్షులు కట్ట



నాగరాజు గౌడ్,ఈదా పద్మారావు, బుర్ల కృష్ణ, అరుగుల వెంకటేశ్వరరావు, వరిగంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిన్న వెంకన్న హుండీ ద్వారా రూ 1కోటి 75లక్షల 65వేల 133లు ఆదాయం

**ద్వారకా తిరుమల ప్రభాతవార్త :**
శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి హుండీ లెక్కింపు సోమవారం ఉదయం ప్రమోద కళ్యాణ మండప ఆవరణలో దేవాలయ ఈవో సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు నడుమ దేవాలయ సిబ్బంది హుండీల లెక్కింపు నిర్వహించారు. గడచిన 18 రోజులకు గాను జరిగిన ఈ హుండీ లెక్కింపు లో శ్రీ వారికి నగదు రూపేణ రూ1,75,65,133లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సత్యనారాయణ మూర్తి



తెలిపారు.అలాగే భక్తులు సమర్పించిన కానుకల రూపేనా 137 గ్రాముల బంగారం,3–130 కేజీల వెండి లభించినట్లు ఈ ఓ పేర్కొన్నారు. పాత నోట్లు 500(13),1000(5),2000(3), అలాగే 15 విదేశీ కరెన్సీ సైతం హుండీలో ద్వారా లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.ఈ క్రమంలో అన్ని విభాగాల సూపరింటెండెంట్లు,ఆలయ సిబ్బంది, భక్తులు,సేవకులు, పాల్గొన్నారు.

# కొవ్వలితో పోలిశెట్టి భేటి



**ప్రభాతవార్త నరసాపురం :**
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడుతో నర్సాపురంలో స్వగృహంలో జనసేన పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త పోలిశెట్టి శ్రీనివాస్ సోమవారం భేటి అయ్యారు. పలు అంశాలపై ముచ్చటించారు. నర్సాపురం నియోజకవర్గ అభివృద్ధికి చేయవలసిన పనులపై ఇరువురు చర్చించుకున్నారు.

# ఆస్తి పన్ను చెల్లింపు కోసం ప్రత్యేక క్యాష్ కౌంటర్లు

**ప్రభాతవార్త నరసాపురం :**
2024–25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను బకాయిలను చెల్లించేందుకు నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉన్నందున పన్ను చెల్లింపుదార్లకు వీలుగా ఆదివారం మరియు సెలవు రోజులలో కూడ క్యాష్ కౌంటర్లు యధావిధిగా పని చేస్తాయని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య ఈరోజు రెవెన్యూ అధికారులతో మీటింగ్ నిర్వహించి తెలిపారు పన్నులు చెల్లింపునకు నెలాఖరు వరకే గడువు ఉన్నందున నరసాపురం మున్సిపల్ ఆఫీస్ క్యాష్ కౌంటర్లు యధావిధిగా పనిచేస్తా



యన్నారు రెవెన్యూ అధికారులు అడబాల నానాజీ మున్సిపల్ సిబ్బంది సచివాలయ సిబంది పాల్గొన్నారు

# ఏజెన్సీలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

## పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

**జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త:**
జిల్లాలోని పోలవరం నియోజక వర్గంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని పోలవరం ఎమ్మెల్యే బాలరాజు సోమవారం అసెంబ్లీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, టీ నర్సాపురం మండలాల్లో నిర్మాణం ప్రారంభించిన భవనాలు పునాదుల వరకు చేశారని తెలిపారు. కొన్నిటికి అవి కూడా లేని పరిస్థితి నెలకొంద ని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనాప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లోనీ ప్రజలు వైద్య సదుపాయం పొందలేక పోతున్నారని ఆరోపించారు. ఆ ఇబ్బందులను తాము గుర్తించామని తెలిపారు. బుట్టాయిగూడెంలో వంద పడకల హాస్పిటల్ మంజూరైన భవన నిర్మాణాలు పూర్తి కాలేదన్నారు. నిర్మాణాలను పునః ప్రారంభించాలని కోరారు. అలాగే బుట్టాయిగూడెంలో వైద్యుల కొరత తీవ్రంగా ఉందన్నారు. అందువలన ఏజెన్సీ ప్రజలు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడానికి నిపుణులైన డాక్టర్లను పూర్తిగా నియమీంచాలని,మధ్యలో వదిలివేసిన హాస్పిటల్స్ భవన నిర్మాణాలను త్వరితగతిని పూర్తి చేయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని తెలిపారు. పలువురు ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే బాలరాజు వైద్య సౌకర్యాలపై గళం విప్పి ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చినందుకు ఆయనకు అభినందనలు తెలిపారు.



## గుర్రపుడెక్క వర్మికంపోస్ట్ కు శ్రీకారం:కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం మార్చి 17 ప్రభాతవార్త : జిల్లాలో ప్రయోగాత్మకంగా గుర్రపు డెక్కతో వర్మీ కంపోస్ట్ రూపొందించడానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు చదలవాడ నాగరాణి డి ఆర్ డి ఏ, వ్యవసాయ, ఇరిగేషన్, డిపిఓ, టూరిజం శాఖల అధికారులతో సమావేశమై గుర్రపు డెక్కతో వర్మీ కంపోస్ట్ రూపొందించడానికి చర్చించడం జరిగినది. తదనంతరం గుర్రపు డెక్కతో ఆర్నమెంటల్ వస్తువులను కూడా రూపొందించేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. గుర్రపు డెక్కలో పోషక విలువలు అధికంగా ఉంటాయని, వర్మీ కంపోస్ట్ రూపొందించడం ద్వారా నత్రజని వంటి పోషకాలు మొక్కలు విరివిగా ఎదగడానికి తోడ్పాటునిస్తాయన్నారు. ఆకువీడు మండలం సిద్దాపురం గ్రామంలో తొలుత గుర్రపు డెక్క నుండి వర్మీ కంపోస్ట్ తయారు చేయడాన్ని ప్రారంభించడం జరుగుతుందని, తదుపరి మూడు గ్రామాలను ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టడం జరుగుతుందన్నారు. పచ్చి గుర్రపు డెక్కన్ కొద్ది రోజులు ఆరుదల చేసి ముక్కలుగా కట్ చేసి ఆవు పేడ, తదితర పదార్థాలను మిక్స్ చేయడం ద్వారా వర్మీ కంపోస్ట్ రూపొందించడం జరుగుతుందని వివరించారు. జిల్లాలోని మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో గుర్రపు డెక్క ద్వారా వర్మీ కంపోస్ట్ ను రూపొందించి అమ్మకాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వర్మీ కంపోస్ట్ ను పెరటి తోటలు, వరి సాగు, పూలు, పండ్ల తోటలు తదితర ప్రదేశాల్లో వినియోగించుకోవచ్చని, తద్వారా ఎక్కువ పోషకాలను మొక్కలకు అందించడంతో ఫల సాయం అధికంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి అరుణ శ్రీ, ఇరిగేషన్ శాఖ ఎఈ వెంకటేశ్వరరావు, జిల్లా పర్యటక శాఖ అధికారి అప్పారావు పాల్గొన్నారు.

## ముత్యాలపల్లి పంచాయతీ పరిధిలో వారతిప్ప రోడ్ లో ఉన్న చేపల మార్కెట్ అధ్వానంగా మారింది పట్టించుకోని అధికారులు

మొగల్తూరు మార్చి 17(ప్రభాతవార్త): మండల కేంద్రమైన మొగల్తూరు ముత్యాలపల్లి పంచాయతీ పరిధిలో వార తిప్ప రోడ్డులో ఉన్న అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో శాసనసభ్యులు బండారు మాధవ నాయుడు ఆధ్వర్యంలో 09/10/2014 సంవత్సరంలో ఆర్ కే ఈ వై పథకం ఫిషరీస్ నిధులు క్రింద ఫిష్ మార్కెట్ 7.50 లక్షల రూపాయలు మంజూరు చేసి నిర్మించడం జరిగింది. ఈ మార్కెట్ ప్రభుత్వాలు మారడంతో పట్టించుకోవడం మానేశారు దీనివలన అధ్వానంగా తయారయింది మందుబాబులు సాయంకాలం 6:00 నుండి ఫిష్ మార్కెట్ కి వచ్చి మద్యం సేవించి కాళీ సీసాలను బద్దలు కొట్టి వెళ్ళిపోతున్నారు దీనివలన సోమవారం వర్తకులు మాట్లాడుతూ ఈ మార్కెట్ అధ్వానంగా మారడంతో దుకాణాలను రోడ్డు ప్రక్కన ఉంచి అమ్ముకుంటున్నామని దీనివలన ట్రాఫిక్ అంతరాయం కలిగి ప్రమాదాలకు దారి తీస్తుందని దీనిని వెంటనే ప్రభుత్వం స్పందించి ఉన్నతాధికారులు తో మాట్లాడి మార్కెట్ మరమ్మతు పనులు మరియు చేపల దుకాణములు కాయకూరలు దుకాణములు విడివిడిగా కేటాయించవలసిందిగా ప్రభుత్వానికి వర్తకులు ప్రజలు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు

## ప్రజా సమస్యల వేదికలో మూడుఅర్జీలు మండల తాసిల్దార్ కే రాజ్ కిషోర్ ప్రకటన



మొగల్తూరు మార్చి 17(ప్రభాతవార్త) మండల కేంద్రమైన మొగల్తూరు మండల కార్యాలయం లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల వేదిక ద్వారా మూడు అర్జీలు వచ్చాయని మొగల్తూరు మండల తాసిల్దార్ కే రాజు కిషోర్ ప్రభాతవార్త రిపోర్టర్ కి తెలియజేశారు మూడు అర్జీలతో ఒకటి రహదారి సమస్య పరిష్కరించాలని రెండు అర్జీలు సర్వే నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని ప్రజా సమస్యల వేదిక ద్వారా వచ్చిన అర్జీలను ఆయా శాఖలకు పంపించి సమస్యలు సకాలంలో పరిష్కరించేందుకు తగ్గిన చర్యలు తీసుకుంటామని మండల్ తాసిల్దార్ కే రాజ్ కిషోర్ తెలియజేశారు

## ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు సర్వే ప్రారంభం



చాట్రాయి, మార్చి17, ప్రభాతవార్త : చింతలపూడి పేజు 2 పథకంలో భాగంగా నరసింహారావు పాలెం శివారు పిట్టల వారి గూడెం వద్ద ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసేందుకు సర్వే ప్రారంభమైంది. నాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరైన ఎత్తిపోతల పథకాన్ని అమలు చేసేందుకు సర్వే తిరిగి ప్రారంభించారు. రింపాడు మేజర్ కాలువ 7.2 కిలోమీటర్ వద్ద పిట్టల వారి గూడెం చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే గోదావరి జలాలను చాట్రాయి, విస్సన్నపేట మండలాలకు మళ్లించేందుకు ఆ ప్రదేశంలో పోతుల పథకానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2019లో మంజూరు చేశారు. పథకం అమలు కోసం ఆ సమయంలోనే 590 కోట్లు నిధులు కేటాయించగా మెగా సంస్థ టెండర్ దక్కించుకుంది. చాట్రాయి మండలం కోటపాడు వద్ద లంచనంగా అప్పట్లో పనులు కూడా చేపట్టారు. ఆ తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాకటం రావడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన నిలిచిపోయాయి. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధికారుల్లోకి రావడంతో చింతలపూడి ఎత్తిపోతల పథకం పై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. పిట్టల వారి గూడెం వద్ద పనులు చేపట్టే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

## ఉపాధి హామీ పనులలో ఇరువురికి గాయాలు



చాట్రాయి, మార్చి 17, ప్రభాతవార్త : మండల కేంద్రమైన చాట్రాయి లో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో ప్రమాదవశాస్తూ కాలు జారడంతో కిందపడిన ఇరువురికి గాయాలయ్యాయి. చాట్రాయి కి చెందిన అంగడాల శ్రీనివాసరావు, సత్యవతి చెరువు పనులు చేస్తుండగా గట్టుమీద కాలుజారటంతో కింద పడటంతో ఇరువురికి చేతులు తిరిగాయి. గాయపడిన శ్రీనివాసరావును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రధమ చికిత్స మండల వైద్యాధికారి నే విజయలక్ష్మి చేసి అనంతరం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి 108 ద్వారా పంపారు. చేతికి శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని వైద్యులు తెలిపారు. అదేవిధంగా గాయపడిన సత్యావతిని ప్రైవేటు వ్యక్తుల ద్వారా విరిగిన చేతికి కట్టు కట్టించారు. గాయపడిన వారిని ప్రభుత్వం పరంగా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## పదోతరగతి పరీక్షలు ప్రారంభం



చాట్రాయి, మార్చి 17, ప్రభాతవార్త : పదవ తరగతి పరీక్షలు పూర్తి బందోబస్తు మధ్య ప్రశాంతంగా ప్రారంభమైనట్లు మండల విద్యాశాఖ అధికారి వి.బ్రహ్మాచారి చెప్పారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు 454 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. హాజరయ్యే వారిలో 432 మంది విద్యార్థులు రెగ్యులర్ కాగా 22 మంది ప్రైవేట్ విద్యార్థులు( ఒకసారి తప్పిన) హాజరవుతున్నారని ఆయన వివరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చాట్రాయి నందు 278 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు ఎందుకురాసేందుకు కావలసి ఉండగా 275 విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి చెప్పారు. అదేవిధంగా చాట్రాయి ఆర్.సి.యం యూపీ స్కూల్ నందు 155 మంది విద్యార్థులు రెగ్యులర్ గాను 153 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరైనట్లు ఆయన చెప్పారు. ప్రైవేట్ విద్యార్థులు ఏడుగురు రావలసిందిగా ఇద్దరు మాత్రమే పరీక్షకు హాజరైనట్లు ఆయన చెప్పారు . ఈ రెండు పరీక్ష కేంద్రములలో ఫర్నిచర్ లైట్లు ఫ్యాన్లు మంచినీటి సౌకర్యములను ఏర్పాటు చేయడం జరిగినదన్నారు. పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ లో జిల్లా కేంద్రం నుండి రాగా వాటిని చాట్రాయి పోలీస్ స్టేషన్ నందు భద్రపరచటమైనది చెప్పారు. ప్రతి పరీక్షకు అరగంట ముందు ఆ మెటీరియల్ విత్ డ్రా చేసి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తాసిల్దార్ చాట్రాయి వారు భారత శిక్షాస్మృతి 163 (144 సెక్షన్) క్రింద పరీక్ష కేంద్రములకు 200 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్లను మార్చి ఒకటో తేదీ వరకు వరకు విదించారన్నారు. ఆర్.సి.యం యూపీ పాఠశాలకు జి.ప్రసాద రెడ్డి అంగిడి శ్రీనివాసరావు , జిల్లా పరిషత్ హై స్కూల్ చాట్రాయి కి, పి.శ్రీనివాస రెడ్డి, గంగాధర్ చీఫ్ సూపర్డెంట్లు మరియు డిపార్ట్మెంట్ ఆఫీసర్లుగాను వ్యవహరిస్తున్నారని చాట్రాయి మండల విద్యాశాఖ అధికారి తెలియజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేయాలని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు పదో తరగతి పరీక్షలలో వచ్చే మార్కుల పైన ఆధారపడి ఉందని అందువల్ల ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఆయన కోరారు.

## హ్యాండీ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ వినయోగించేకోండి: కలెక్టర్ చదలవాడనాగరాణి

**భీమవరం మార్చి 17 ప్రభాతవార్త :** నరసాపురంలో నిర్వహించే "హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్ పో" ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. న్యూఢిల్లీ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్స్ వారి ఆధ్వర్యంలో నరసాపురంలో నిర్వహించనున్న "హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్ పో" గోడ పత్రికను సోమవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత యాజమాన్యంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వివిధ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే వస్తు, వస్త్ర ప్రదర్శనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మార్చి 21 నుండి మార్చి 25 వరకు ఉదయం 11 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నరసాపురం రుస్తుంబాధ కొత్త కాలవ రోడ్డులోని ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ నందు "హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్ పో" ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఎక్స్ పో నందు భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన హ్యాండీక్రాఫ్ట్స్, ఫ్యాషన్ జ్యూయలరీ, గృహోపకరణములు, హోమ్ ఫర్నిషింగ్, లేసు ఉత్పత్తులు, కలంకారీ శారీస్, ఫ్యాషన్ హ్యాండ్ బ్యాగ్స్, రెడీమేడ్ వస్త్రాలు, తదితర వస్తువుల ప్రదర్శన, అమ్మకం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గోడపత్రిక ఆవిష్కరణలో ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ కన్వీనర్ కలవకొలను తులసి, లేస్ ఎక్సపోర్టర్స్ తాతాజీ, కలవకొలను రాజీవ్, ఏ.బాబు పాల్గొన్నారు.

## చాట్రాయి ఇన్చార్జి తహసిల్దారుగా గీత



చాట్రాయి, మార్చి 17 , ప్రభాతవార్త : చాట్రాయి మండల ఇన్చార్జి తహసీల్దారుగా గీతను నియమిస్తూ నూజివీడు సబ్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. చాట్రాయి మండల రెవెన్యూ కార్యాలయంలోనే రీ సర్వే డిప్యూటీ తాహసిల్దారుగా పనిచేస్తున్న గీతకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. చాట్రాయిడ్ తహసిల్దారుగా పనిచేసిన డి ప్రశాంతి అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఇటీవల సస్పెండ్ అయిన విషయం విధితమే.

## టెన్త్ పరీక్షలకు 556 మంది హాజరు.

అత్తిలి - మార్చి 17 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలం లో 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలకు 556 మంది మొదటి రోజు హాజరైనట్లు ఎంఈఓ పి రమేష్ తెలిపారు. 552 మంది రెగ్యులర్ విద్యార్థులలో 548 మంది హాజరైనట్లు తెలిపారు. 9 మంది ప్రైవేట్ అభ్యర్థులకు 8 మంది హాజరైనట్లు తెలిపారు.

## 22 న మండల పరిషత్ సమావేశం

అత్తిలి - మార్చి 17 ( ప్రభాత వార్త ): అత్తిలి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 22 న జరుగుతుందని ఎంపిడిఓ పి . శ్యామ్యూల్ తెలిపారు. మండల అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపిటిసి సభ్యులు , సర్పంచ్లు , అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

## పెన్షనర్లు సమస్య పై తహసీల్దార్ కు వినతి పత్రం.



అత్తిలి- మార్చి 17 ( ప్రభాత వార్త ): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు అత్తిలి తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ దశిక వంశీకి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మండల పెన్షనర్లు సంఘాధ్యక్షుడు పమ్మి గోపాల కృష్ణ మూర్తి మాట్లాడుతూ పెన్షనర్లకు చెల్లించాల్సిన డిఆర్ బకాయిలు , పీఆర్సీ బకాయిలు చెల్లించాలని కోరారు. గత పీఆర్సీ లో తగ్గించిన అదనపు పెన్షన్ క్వాంటమ్ ను పునరుద్దరించాలని కోరారు. ఆరోగ్య కార్డులపై ఆసుపత్రిల వారు చికిత్స చేయడంలేదని తెలిపారు. దీనివల్ల పెన్షనర్లు తీవ్రఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగదురహిత చికిత్స చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త పీఆర్సీ కమిటీ ని వెంటనే నియమించాలని కోరారు. సంఘ సభ్యులు కూడా వినతిపత్రం ఇచ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు. .

## సీసీ రోడ్లు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మి



జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త: పట్టణం లో మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న సీసీ రోడ్ పనిని పరిశీలిస్తున్న జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్పర్సన్ బత్తిన లక్ష్మి. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిటికెలా అచ్యుతా రామయ్య, లోకవరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## శ్రీ మద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకున్న హీరో నితిన్



జంగారెడ్డిగూడెం, ప్రభాత వార్త: మండలంలోని గుర్వాయిగూడెం గ్రామం నందు శ్రీ మద్ది ఆంజనేయ స్వామిని ప్రముఖ సినీ హీరో నితిన్, మైత్రి మూవీస్ అధినేత రవిశంకర్, దర్శకుడు వెంకి కుదుముల విచ్చేసి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపం వద్ద వేద ఆశీర్వచనం గావించారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ శ్రీ స్వామి శేషవస్త్రలతో సత్కరించి, ప్రసాదములు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి. చందన తెలిపారు.

## మినుములు, పెసలు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం..

### జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి



ఏలూరు,మార్చి, 17: ప్రభాత వార్త ఎ.పి.మార్క్ ఫెడ్ మరియు నాఫేడ్ అధ్వర్యంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో మినుములు, పెసలు(అపరాలు) కొనుగోలు కేంద్రాలు నేటి నుండి ప్రారంభిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెసలు కొరకు పెదపాడు, వట్లూరు, డిసిఎంఎస్ ఏలూరు, జాలిపూడి, దెందులూరు సొసైటీలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మినుములు కొరకు లింగాల, దేవపూడి, తామరకొల్లు, డిసిఎంఎస్ ఏలూరు, దెందులూరు, డిసిఎంఎస్ అప్పన్నవీడు, పెదపాడు, వెంకటాపురం సొసైటీలలో కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. సిఎం యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతు కూడా తమకు కేటాయించిన తేది ప్రకారం కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చి తమ పంటను విక్రయించుకోవచ్చున్నారు. క్వింటా ప్రభుత్వం మద్దతు ధర పెసలు రూ. 8,682/- మరియు మినుములు రూ.7,400/- కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

**నాణ్యత ప్రమాణాల వివరములు..**

ఇతర వ్యర్థా పదార్థాలు 2 శాతం, దెబ్బతిన్న పప్పుదినుసులు గింజలు 3శాతం, కొద్దిగా దెబ్బతిన్న , రంగులేని పప్పుదినుసు గింజలు 4శాతం, వక్వానికి రాని, ముడత/ కుచించుకుపోయిన పప్పుదినుసులు గింజలు 3శాతం, ఇతర పప్పుదినుసు గింజలు 3 శాతం, పురుగు పట్టిన పప్పుదినుసు గింజలు 4శాతం, తేమ శాతం 12శాతం, రైతుల వద్ద నుండి మాత్రమే మద్దతు ధరపై కొనుగోళ్ళు చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందన్నారు. నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు కలిగిన పెసలు మరియు మినుములు మాత్రమే కొనుగోళ్ళు నగదు రైతు బ్యాంకు ఖాతాకు నేరుగా చెల్లిస్తామన్నారు. వివరాల కొరకు సంప్రదించవలసిన నంబర్లు: మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీకాంత్, నెంబర్: 9100955934, కంట్రోల్ రూమ్ నెంబర్: 7702003584, నెంబర్లను సంప్రదించవచ్చున్నారు.

## కేంద్ర మంత్రి వర్మను పరామర్శించిన మంత్రి నిమ్మల



భీమవరం మార్చి 17 ప్రభాతవార్త : ఢిల్లీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు పరామర్శించారు. భీమవరంలోని భూపతిరాజు శ్రీనివాస వర్మ నివాసం వద్ద ఆయన్ని కలిసి కారు ప్రమాదం జరిగిన తీరును ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస వర్మ త్వరగా కోలుకోవాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆకాంక్షించారు. కేంద్ర మంత్రి వర్మను పరామర్శించిన వారిలో ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చెల్లం ఆనంద ప్రకాష్, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ మంతెన యోగేంద్ర బాబు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు , డిటిడిసి బాబు, బిజెపి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి ఐనంపూడి శ్రీదేవి, పెద్ద సంఖ్యలు శ్రేయోభిలాషులు, కూటమి పార్టీల నాయకులు ఉన్నారు. డాక్టర్లు తగిన విశ్రాంతి అవసరమని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ కు సూచించినప్పటికీ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖకు సంబంధించి సభ్యుల ప్రశ్నలకు మంత్రిగా తాను సమాధానం చెప్పవలసి ఉండటంతో శ్రీనివాస వర్మ సోమవారం మధ్యాహ్నం ఢిల్లీ బయల్దేరి వెళ్లారు.

## ముగిసిన మదన గోపాల స్వామి ఉత్సవాలు .



అత్తిలి - మార్చి 17 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలం బల్లిపాడు మదనగోపాలస్వామి వారి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఈ నెల 7 నుండి ప్రారంభమైన ఉత్సవాలు సందర్భంగా 9 రాత్రి స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. 10 న రథోత్సవం ఘనంగా నిర్వహించారు. 11 రాత్రి పొన్న వాహనోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. భారీ ఎత్తున బాణాసంచా కాల్చరు . 14 న శ్రీ చక్రస్నానం , 15 పుష్పోత్సవం నిర్వహించారు. 16 నుండి 3 రోజులు వ ళా యి తీ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రతిరోజూ స్వామి వారిని , అమ్మ వారిని వివిధ వాహనాలపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ పెద్దలు ముత్యాల నాగేశ్వరరావు, గారపాటి ధర్మయ్య, ప్రగడ నాగేశ్వర రావు, ఉత్సవ కమిటీ సభ్యులు గారపాటి బాబ్జి, గారపాటి అశోక్, తోట గణేష్, ఆకుల తాతాజీ, బుద్దాల భాస్కర రావు, ప్రగడ గణేష్, గూనా పవన్, పెచెట్టి సత్యనారాయణ, గుణుపూడి నరేష్, కొల్లి సంతోషం, కోడిచుక్కల పోతురాజు, దాసం ఆదినారాయణ, కసిరెడ్డి వాసు, ఆచంట రమణ, బండి సోమేంద్ర ఆలయ కార్యనిర్వహణాధికారి లింగంపల్లి లోకనాథ్ శ్రీనివాసరావు, అర్చకులు పెద్దింటి సత్యనారాయణాచార్యులు , పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవాలు ముగిసాయి .

## పది పరీక్షలు ప్రారంభం

పెనుమంట్ర, మార్చి-17, ప్రభాతవార్త: పెనుమంట్ర మండలంలో పది పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఉండగా, పొలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 72 మంది విద్యార్థుకు గాను 71 హాజరయ్యారు. మార్టేరు ఎస్ వి జి ఉన్నత పాఠశాలకు 199కు గానూ 195 విద్యార్థులు హాజరయ్యారు. మార్టేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 68 విద్యార్థులకు గాను 67 మంది విద్యార్థులు హాజరయ్యారు. పెనుమంట్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 168 విద్యార్థులకు మొత్తం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 507 మంది విద్యార్థులకు గాను 501 మంది విద్యార్థులు హాజరు కాగా, ఆరుగురు గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి వై లక్ష్మీనారాయణ, ఎంఈఓ-02 ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు.

## మానవతా ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



కొయ్యలగూడెం ప్రభాతవార్త మార్చి 18 వేసవికాలం దృష్ట్యా మానవతావాదులు జన సమూహాలు ఉండే చోట బస్టాండ్ , నాలుగు కూడలి జంక్షన్ మధ్య చలివేంద్రాలను ఏర్పాటు చేయుటకు ముందుకు రావాలని మానవతా అధ్యక్షులు మాటూరు సుధీర్ అన్నారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ కోయిలగూడెం మండలంలో పదవ తరగతి పరీక్షలు రాయుటకు వస్తున్న విద్యార్థిని విద్యార్థులకు మానవతా ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్ నందు చల్లని త్రాగునీరు సదుపాయాన్ని ఏర్పాటు చేశారు

## హర్షం వ్యక్తం చేస్తున్న జనసైనికులు



కొయ్యలగూడెం ప్రభాతవార్త మార్చి 18 అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై గళం విప్పి మాట్లాడుతున్న పోలవరం శాసనసభ్యులు చెర్రీ బాలరాజు వ్యాఖ్యలకు జనసేన నాయకులు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ముఖదరమైన కొయ్యలగూడెం నియోజకవర్గంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా ప్రాతినిధ్యం వహించేది కొయ్యలగూడెం మే, కానీ అభివృద్ధిలో మాత్రం శూన్యం గానే ఉంది అనే ప్రజలంటున్నారు. ప్రజా సమస్యల పై గత ప్రభుత్వంలో పదవులు చేసినటువంటి ఏ నాయకుడు ప్రజా సమస్యలపై ఎప్పుడు దృష్టి పెట్టలేదని అన్నారు గిరిజన ప్రాంతాలలో ఉన్నటువంటి సమస్యలు విద్య ,వైద్యం, త్రాగునీరు, మౌలిక సదుపాయాలను గత ప్రభుత్వ హయాంలో అధ్వానంగా ఉన్నాయని అన్నారు. అసెంబ్లీ వేదికగా ఏజెన్సీ గ్రామాల ఉన్న సమస్యలపై మాట్లాడడంతో ఏజెన్సీ గ్రామాల రూపురేఖలు మారతాయని జన సైనికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## పెదవాగు ప్రాజెక్టును సందర్శించిన ఆంధ్రప్రదేశ్ ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు



వేలేరుపాడు, మార్చి 17 ప్రభాతవార్త : వేలేరుపాడు మండలం పెదవాగు ప్రాజెక్ట్ సందర్శన లో భాగంగా కమ్మరిగూడెం గ్రామస్తులు మరియు పెదవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులు పోలవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుకు ఘన స్వాగతం పలికారు. ట్రైకర్ చైర్మన్ బొరగం. శ్రీనివాసులు పెదవాగు ప్రాజెక్టును సందర్శించి రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అమరవరపు అశోక్, శ్రీను,వాసిరెడ్డి జగన్, గొర్రి సుగుణ, కట్టాం బేబీ, కుంజా నిర్మల, సరియం సీతమ్మ, కట్టాం కనకరావు గార్లు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

